పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప : మానసిక రోగులు మందులను సకాలంలో వాడి వ్యాధి తీవ్రతను తగ్గించుకోవాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ సూచించారు. మంగళవారం జడ్జి కడప రిమ్స్ ఆవరణంలో ఉన్న ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ ను సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ (నల్సా) వారి మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు, మేధో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు పథకం 2024 ను, ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని పేర్కొన్నారు. మానసిక ఆరోగ్యం సంరక్షణ చట్టం 2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014 ప్రవేశపెట్టిందని తెలిపారు. మానసిక వ్యక్తుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, మందులను సకాలంలో వాడి వ్యాధి తీవ్రతను తగ్గించు కోవాలి అన్నారు కార్యక్రమంలో హెల్త్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రాముడు, డాక్టర్లు వంశీకృష్ణ సురేష్, సాహిద్‌బాషా, సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

పెరగని 'ఉపాధి'

రూ.409 కోట్లతోనే పనులు
80 లక్షల పని దినాల కల్పన
రూ.95 కోట్ల చెల్లింపుల కోసం నిరీక్షణ

చాపాడు మండలం చియ్యపాడులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఉపాధి హామీ బడ్జెట్ ప్రణాళిక ఆశించిన రీతిలో కనిపించడం లేదు. 2024 బడ్జెట్ సుమారు రూ.400 కోట్ల కేటాయింపుల తరహాలోనే 2025-26లో రూ.409.33 కోట్ల బడ్జెట్ ప్రణాళికతో సరిపెట్టింది. జిల్లాలో 35 మండలాల పరిధిలో 2,26,681 జాబ్‌కార్డుల్లో 4,14,440 మంది కూలీలు ఉన్నారు. 1,93,393 యాక్టివ్ కార్డుదారుల్లో 3,03,864 మంది యాక్టివ్ కూలీలు ఉన్నారు. ఈ ఏడాది యాక్టివ్ కూలీలను 80 లక్షల పనిదినాలకు పరిమితం చేసింది. 2025-26 బడ్జెట్ ప్రణాళికలో లేబర్ వేజెస్ కింద రూ.245.60 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.163.73 కోట్లు కేటాయించింది. ప్రతి ఏటా ధరల పెరుగుదల కారణంగా పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో 15 శాతం మేరకు అదనంగా కేటాయింపులు చేయడం పరిపాటి. 2025-26 సంవత్సర బడ్జెట్ ప్రణాళికలో అదనపు నిధుల గానీ పనుల కేటాయింపులు గానీ చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా నీటియాజమాన్య సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.393 కోట్లతో ఉపాధి హామీ పనులు చేపట్టింది. 76,27,382 మందికి ఉపాధి పనులు కల్పించింది. ఖరీఫ్, రబీ సీజన్లో వరుస కరువు పరిస్థితుల నేపథ్యంలో అదనంగా ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్లు వినిపించినప్పటికీ కేటాయింపుల్లో పెరుగుదల కనిపించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. గతేడాది బడ్జెట్‌లో లేబర్ వేజెస్ కింద రూ.198 కోట్లు, మెటీరియల్ వేజెస్ కింద రూ.174 కోట్ల లెక్కన రూ.393.99 కోట్లతో ఉపాధి హామీ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 15 నాటికి 31,456 కుటుంబాలకు చెందిన 43,026 మందికి ఉపాధి హామీ పనులు కల్పించింది. కడప-కర్నూలు కాలువకు నీటి సరఫరా నిలుపుదల, వేసవి సీజన్‌లో పక్కాగృహాల పనులు, 707 పశువుల తొట్ల పనులు ఉపయోగపడే అవకాశాల నేపథ్యంలో రోజుకు లక్ష మంది కూలీల చొప్పున ఉపాధి హామీ పనులకు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. కేంద్రంలోని బిజెపి సర్కారు లేబర్ వేజెస్ కింద రూ.70 కోట్లు, మెటీరియల్ వేజెస్ కింద రూ.25 కోట్లు వెరసి రూ.95 కోట్లు చెల్లింపులు నిలిపివేయడం ఆందోళన కలిగిస్తోంది. ఫిబ్రవరి మొదటి వారం నుంచి నేటి వరకు సుమారు 10 వారాలుగా ఉపాధి హామీ పనులకు చెల్లింపులు నిలిపివేయారు. ఫలితంగా ఉపాధి కూలీల హాజరులో మందగమనం కొనసాగుతోంది. గతేడాది మార్చి 15 నాటికి 74 వేల మంది ఉపాధి కూలీలు హాజరు కాగా ఈ ఏడాది 68 వేల మంది హాజరు కావడం గమనార్హం. ఉపాధి హామీ బిల్లుల చెల్లింపుల ప్రక్రియ ఊపందు కుంటేనే ఉపాధి హామీ పథకం కూలీల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. ఏదేమైనా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కేటాయింపుల్లో నిర్లక్ష్య వైఖరిని విడనాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

బోగస్ పట్టాలను రద్దు చేయకపోతే
ఆందోళన తప్పదు

రెవెన్యూ అధికారుల పాత్ర పై ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలి
ఆచార్యుల కాలనీలో పర్యటించిన సిపిఎం నాయకులు

కాలనీలో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని 15వ డివిజన్ సరోజినినగర్ దగ్గర ఉన్న ఆచార్యుల కాలనీలో మౌలిక సమస్యలు, బోగస్ పట్టాలు, భూకబ్జాల పరిశీలన కోసం మంగళవారం సిపిఎం ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ మాట్లాడుతూ 15వ డివిజన్‌లో ఉన్న ఆచార్యుల కాలనీ 30 ఏళ్ల కిందట ఏర్పాటైందని పేర్కొన్నారు. ఇప్పటికీ అక్కడ మౌలిక వసతులు, రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి సమస్య పరిష్కరించడంలో పాలకులు, అధికార యంత్రాంగం విఫలం చెందారని విమర్శించారు. ఇంటి పట్టాలు, ఇళ్ల స్థలాలు దళారీల చేతిలో ఉన్నాయని పేర్కొన్నారు. భూకబ్జా దారులు యథేచ్ఛగా అమ్ముకుంటున్నారని, ఇందులో రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని ప్రజలు సిపిఎం ప్రతినిధి బృందం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న వారికి, క్రిస్టియన్ మైనార్టీలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. కానీ లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు ఇవ్వకుండా కొంత మంది వ్యక్తుల దగ్గర పట్టాలున్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు వాటిని కొంతమంది బినామీ పేర్లతో దొంగ పట్టాలు సృష్టించి అమ్ముకుంటున్నారని తెలిపారు. వీటిపై జిల్లా ఉన్నత స్థాయి అధికారులు విచారణ జరిపి భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది రెవెన్యూ అధికారులు భూకబ్జాదారులకు వత్తాసు పలకడంతో గతంలో ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ పేరుతో దొంగ పట్టాలు సృష్టించి ఆచార్య కాలనీలో భూ కబ్జాలకు పాల్పడుతున్నారని చెప్పారు. గతంలో కొంతమందికి పట్టా, స్థలాలు ఉన్నా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు భూ కబ్జాదారులతో చేతులు కలిపి దాడులకు, దౌర్జన్యాలకు, బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే విచారించి ఇల్లు లేని నిరుపేదలకు కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మౌలిక సమస్యలు, బోగస్ పట్టాలు, భూ కబ్జాలపై సిపిఎం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన, పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. పర్యటనలో సిపిఎం నాయకులు దస్తగిరి రెడ్డి, గోవిందు, నరసింహ, శేఖర్, జార్జి పాల్గొన్నారు.

వైవీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్, ఎంఎస్‌సి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పరీక్షలు మంగళవారం విశ్వ విద్యాలయ ఎపిజె అబ్దుల్ కలాం గ్రంథాలయ భవనంలో ప్రారం భమయ్యాయి. ఈ పరీక్షలను రిజిస్ట్రార్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఆచార్య కె.ఎస్.వి .కృష్ణారావుతో కలసి తనిఖీ చేశారు. పలువురి విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. నిర్వహణలో ఇబ్బందుల గురించి ఆరా తీశారు. కట్టుది ట్టంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్షలు సూపరిం టెండెంట్ ఆచార్య కాత్యాయని మాట్లాడుతూ పరీక్షా కేంద్రం లో 543 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఒకరు మాత్రమే గైర్హాజర య్యారని తెలిపారు. నిర్వహణకు అన్ని జాగ్రత్తలు తీసుకు న్నామని వివరించారు. పరీక్ష కేంద్రం అబ్జర్వర్లుగా డాక్టర్ ప్రమీల మార్గరెట్, డాక్టర్ రాఘవేంద్ర కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్వహణ బాధ్యతల్లో అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ ముని కుమారి, సిబ్బంది చంద్రమౌళి పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వడ్డీపై 5 శాతం రాయితీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరపాలక సంస్థకు ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు 2024-25, మార్చి 31 వరకు బకాయిలు ఉన్న వారు ఈ నెలాఖరులోపు ఏక మొత్తంగా చెల్లిస్తే వడ్డీలో 5 శాతం రాయితీ ఉంటుందని కమిషనర్ మనోజ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఆఖరి వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందని పేర్కొన్నారు. ఈ అవ కాశాన్ని యజమానులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 2025-26, ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను ఏప్రిల్ 30కి ఏక మొత్తం చెల్లిస్తే పన్నులో ఐదు శాతం రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు. పన్ను లు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో, సచివాలయాల్లో, ఆన్లైన్ ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. సెలవు రోజుల్లో కౌంటర్లు ఉద యం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు.

వైవీయూలో ప్రపంచ కళా వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : లలిత కల విభాగంలో ప్రముఖ చిత్రకారుడు 'లియోనార్డ్ డావిన్సీ' 574వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీ డీన్ ఆచార్య కె.గంగయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ లియోనార్డ్ డావిన్సీ బహుముఖ ప్రజ్ఞాశాలి అని చిత్రకళా రంగంలో ఉన్న అత్యద్భుతమైన పటిమ కారణంగా శాస్త్రవేత్తగాను, గణిత శాస్త్రవేత్తగాను, ఇంజనీర్ గాను, శిల్పకారుడు, వృక్షశాస్త్రజ్ఞుడు, సంగీతకారుడుగా రాణించారని పేర్కొ న్నారు. సాంకేతిక అభివృద్ధిలో భాగమైన ఎన్నో విషయాలను లియో నార్డో శతాబ్దాలు ముందే తన స్కెచ్ లో శాస్త్రీయంగా శోధన చేసి పొందుపరిచారని చెప్పారు. కార్యక్రమంలో డిపార్ట్మెంట్ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు, అధ్యాపకులు సి.హెచ్.వెంకటేష్, బి.చిన రాయుడు, బి.వీరప్ప, ఎం.వాసవి, చంటి సూరి, డాక్టర్ కె.రెడ్డి శేఖర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ వి.సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుబంధ పత్రాలు ఇవ్వండి

ప్రజాశక్తి - కడప అర్బన్

తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మన్నూరు అక్బర్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇళ్ళు లేని పేదలకు ప్రభుత్వం ద్వారా మంజూరుకు అవకాశం కల్పించారని, వారి అను బంధ పత్రాలు ఇవ్వాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్ కోరారు. మంగళవారం చెన్నూరు తహశీల్దార్ సరస్వతమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామనపల్లి, చెన్నూరు ప్రజలకు 40-50 ఏళ్ల నుంచి స్థలాలలో నివాసం ఉన్నారని, అనుభవం చూసి అనుబంధ పత్రాలు ఇవ్వాలని కోరారు. ఇంటి పన్నులు, విద్యుత్తు బిల్లులు ఉన్నాయని చెప్పారు. విఆర్‌ఒతో సమాచారం తెప్పించుకుని నివాస అనుబంధం పత్రాలు ఇస్తే పేదలు ఇళ్ళు నిర్మించుకునే కల సహకారం అవుతుందని తెలిపారు. కార్యక్రమం జిల్లా బిసి సెల్ అధికార ప్రతినిధి సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ మార్కులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇటీవల విడుదల అయిన ఇంటర్ ఫలితాల్లో కడప ఎన్‌జిఒ కాలనీ లో ఉన్న నారాయణ ఒలంపియాడ్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపిసి చదువుతున్న వెంకట చందు 462/470 మార్కులు సాధించాడు. మంగళవారం కళాశాలలో డీన్ చంద్ర కిషోర్ రెడ్డి, ప్రిన్సిపల్ మురళీమోహన్ పూల బొకేతో అభినందించారు.

ఆర్ఒప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : జడ్‌పి ఛైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి మంగళవారం జడ్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో కార్యాలయ సిబ్బంది చల్లనీరు తాగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, వైస్ ఛైర్మన్ పిట్టు బాలయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎపి ఆర్‌ఐసి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సిఇఒను ఇఆర్‌ఎస్ ఘనంగా సత్కరించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని హోమియోపతి వైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రభుత్వ అసిస్టెంట్ ప్రొఫెసర్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యను, మంచి లక్షణాలను బోధించాల్సిన ప్రొఫెసర్ విద్యార్థునుల ఫోటో మార్ఫింగ్ చేసి 'ఎవరికైనా చెప్తే మీ మార్కులను తగ్గిస్తాం, ఎగ్జామ్‌లో ఫెయిల్ చేస్తాను' అని వేధింపులకు గురి చేస్తున్న మణికంఠ అనే అసిస్టెంట్ ప్రొఫెసర్ దుర్మార్గానికి దిగదారడం దారుణమన్నారు. సంఘటన జరిగి వారం అవుతున్నా, బాధితురాలు ఆయనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనకాల రహస్యమేమిటో అర్థం కావడం లేదని చెప్పారు. ఇంత జరుగుతున్న మందలించాల్సిన ప్రిన్సిపల్ సాంబశివమూర్తి ఆయనకు వత్తాసు పలుకుతూ చేస్తూ కళాశాలను, విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివారు విద్యార్థులు విద్యకు దూరం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వెంటనే దీని పైన చర్యలు తీసుకోవాలని, అతన్ని తక్షణం విధులనుంచి తప్పించి విచారణ చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నగర్ నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

లెదర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తాం

ప్రజాశక్తి - గోపవరం : బద్వేల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మాదిగ చర్మకారులకు చెన్నంపల్లి పొలం 1580 -బి పొలంలో 3ఎకరాల 64 సెంట్లలో లెదర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి చెప్పులు కుట్టుకునేవారికి కామన్ ఫెసిలిటీ సెంటర్ ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేపిస్తామని రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ గన్నేపాటి మల్లేష్ పేర్కొన్నారు. మంగళవారం బద్వేల్ పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లాలో లీడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ గూడూరు రాజశేఖర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలో ఉన్నటువంటి చెన్నంపల్లి గ్రామం పొలం సర్వేనెంబర్ 1580లో ఉన్నటువంటి 3 ఎకరాల 64 సెంట్లు స్థలాన్ని కబ్జా కాకుండా చూసి మాదిగ పిల్లలకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంత మాదిగ నిరుద్యోగ విద్యార్థులకు ఉపాధ్యాయ అవకాశము కల్పిస్తామని పేర్కొన్నారు. లెదర్ పార్కు ఉన్నటువంటి స్థలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కబ్జా కాకుండా చూసి ఆ స్థలాన్ని సద్వినియోగం అదేవిధంగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో దళిత సీనియర్ నాయకులు ఒఎస్‌వి ప్రసాద్, ముండ్లపాటి పిచ్చయ్య, కమలాపురం బాలయ్య, దళిత వేదిక జిల్లా నాయకులు ఓబయ్య, కోడూరు ఓబయ్య, నాగిపోవు ప్రసాద్, దళిత నాయకులు పాల్గొన్నారు.

రాయలసీమ జోన్ అధ్యక్షులుగా పి.జె.రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - కడప : పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాయలసీమ జోన్(కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం) అధ్యక్షులుగా వైఎస్ఆర్ జిల్లా కడప వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎంపిహెచ్ఇఒగా పని చేస్తున్న పి.జె. రామ సుబ్బారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడపలో నిర్వహించిన వైద్య ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఆస్కారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జం బారపు అహరోన్ సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో పి.జె. రామసుబ్బారెడ్డి రాయ లసీమ జోన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టిడికె సాగర్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పి.జె. రామ సుబ్బా ర్డ్డి మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ జోనల్ ఉద్యోగుల సమస్యలపై, ఫీల్డ్ సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ రద్దుపై చొరవ చూపుతానమ్మన్నారు. ఉద్యోగుల, సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఆపరేషన్ కగార్ రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి- కడప అర్బన్

దేశంలోని బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీల మీద నరమేధాన్నీ కొనసాగిస్తుందని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు.మంగళవారం ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్‌రెడ్డి, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గోపాల్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాయలసీమ కార్మిక సమాఖ్య నాయకులు శ్రీని వాసరెడ్డి మాట్లాడారు. బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను హత్యగావిస్తుందని ఆరోపించారు. ముఖ్యంగా మావోయిస్టుల అణిచివేత పేరుతో అన్యం పుణ్యమెరగని అడవి బిడ్డలపై తీవ్రమైన అంచవేతకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడవుల నుంచి ఆదివాసీలను, వాళ్లకు అండగా ఉన్న మావోయిస్టులను తరిమేయడం ద్వారా అడవులను బడా కార్పోరేట్లకు అప్పగించాలన్న కుట్ర దాగి ఉందని తెలిపారు.

అంబేద్కర్ పట్ల మోడీ మత విద్వేషం

ప్రజాశక్తి - కడప

భారత రాజ్యాంగ నిర్మాత, దార్శనికుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి మత విద్వేషాన్ని ప్రదర్శించారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ప్రధానులు పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో సంప్రదాయబద్ధంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతికి ఘనంగా నివాళి అర్పించే వారన్నారు. ఇదే పార్లమెంటు సెంట్రల్ హాల్లో అంబేద్కర్ భారతదేశానికి రాజ్యాంగాన్ని సమర్పించారన్నారు. కానీ ఇటీవల అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ హర్యానా రాష్ట్రంలోని బిజెపి పార్టీ ర్యాలీకి వెళ్లేందుకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారని దుయ్యబట్టారు. అ అంబేద్కర్ వర్ధంతికి పార్లమెంటు సెంట్రల్ హాల్లో నివాళి అర్పించలేదన్నారు. ఈ సంఘటన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారతీయ జనతా పార్టీకి బి.ఆర్ . అంబేద్కర్ పట్ల ఉన్న గౌరవ, మర్యాదలు ప్రజలకు బహిర్గతమయ్యిం దన్నారు. కేవలం ఓట్ల కోసమే దళితుల పట్ల ప్రేమ చూపుతున్న మత విద్వేష పాలకుడు ప్రధాని నరేంద్ర మోడీ అని విమర్శి ంచారు. ప్రధాని మోడీ పార్లమెంటు సెంట్రల్ హాల్లో అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి హాజరవ్వాల్సి ఉండగా కేవలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ సోనియాగాంధీ , ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్సభ స్పీకర్ ఓమ్ బిర్లా, బిజెపి అధ్యక్షుడు, మంత్రి నడ్డా ఇతరులు హాజరయ్యారన్నారు.. దళితులకు సంబంధించిన రిజర్వేషన్లను తొలగించడానికి ప్రయత్నించిన బిజెపి ప్రభుత్వం ఎంతో కాలం మనుగడ సాగించ లేదని విమర్శించారు.

21న ఎపి మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - వల్లూరు

ఆదర్శ పాఠశాలల్లో ఈనెల 21న ఆరవ తరగతి ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎం.సురేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 20న నిర్వహించవలసి ఉండగా ఈస్టర్ పండుగ రావడంతో రాష్ట్ర ప్రభుత్వం 21కు పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి 21న ప్రవేశ పరీక్ష ఉదయం 8 గంటలకు విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

రౌండ్ టేబుల్ సమావేశం జయప్రదం చేయండి

ప్రజాశక్తి- అట్లూరు : 'వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం -రాజ్యాంగబద్ధత సవాళ్లు' అనే అంశంపై ఈనెల 21న నిర్వహించబోయే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. చాంద్‌బాషా, మండల కార్యదర్శి ఇ. రమణయ్య పేర్కొన్నారు. మంగళవారం క్రాస్ రోడ్డులో సిపిఎం కార్యాలయంలో సమావేశానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 5 అర్ధరాత్రి వక్ఫ్ సవరణ చట్టానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలపై భౌతిక దాడులు చేస్తుంటే వాటిని ఖండించకుండా ప్రేక్షక పాత్ర పోషించడం సరైంది కాదన్నారు. నరేంద్ర మోడీ ముస్లింలకు న్యాయం చేస్తానని మాయ మాటలు చెబుతున్నారని, ఈ చట్టం ముస్లింలకు నష్టమే తప్ప లాభం లేదని వాపో యారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను అప్పణంగా కార్పొరేట్ సంస్థలకు కట్టబ ట్టేందుకు కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. పైగా ముస్లింలపై కపట ప్రేమ చూపుతున్నారని చెప్పారు. సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. తుసిరెడ్డి, డిసిసి అధ్యక్షులు ఎన్. విజయజ్యోతి, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. అబ్దుల్ సుబాన్, తదితరులు హాజరవుతారన్నారు. లౌకికవాదులు, ప్రజా స్వామ్య వాదులు హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులు ప్రతి ఒక్కరూ పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో సిపిఎం నాయకులు స్వప్న, లతమ్మ, వెంకటసుబ్బయ్య, ప్రశాంత్‌బాబు, సునీల్ కుమార్ ,సుధాకర్ పాల్గొన్నారు. **బద్వేల్ :** ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె. శ్రీను, పి. చాంద్‌బాషా పేర్కొన్నారు. మం గళవారం వారు కరపత్రాలు విడుదలచేశారు. కార్యక్రమంలో బద్వేల్ పట్టణ కమిటీ సభ్యులు చిన్ని మస్తాన్ షరీఫ్ శివ, నాయకులు నాగార్జున ఆవాజ్ బద్వేల్ పట్టణ అధ్యక్షులు అబ్దుల్ సత్తార్, ఆవాజ్ నాయకులు ఖాజా గౌస్, మాహీర్, మహమ్మద్‌గౌస్, అల్ల బకాష్, బాబయ్య, ఖాదర్ బాషా, సిపిఎం సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

డిఎస్‌సిపై మొదటి సంతకం హామీ ఏమైంది? : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికలలో నిరుద్యోగ అభ్యర్థులకు అధికారంలోకి రాగానే డిఎస్‌సిపై మొదటి సంతకం చేస్తామని, నోటిఫికేషన్ వదిలి నియామక ప్రక్రియలు చేపడతామని హామీ ఇచ్చి నేటికీ ఎనిమిది నెలలు అవుతున్నా పట్టించుకోలేదని, ఆ హామీ ఏమైందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ప్రశ్నించారు. మంగళవారం కడపలోని వెంకట సాయి కోచింగ్ సెంటర్‌లో నిరుద్యోగ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం రాష్ట్రంలో నిరుద్యోగ అభ్యర్థులు ఏడేళ్లుగా ఎదురు చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఐదు ఐదేళ్లల్లో ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తే, ఈ ప్రభుత్వంలో అభ్యర్థుల ఆశలను ఆవిరి చేస్తుందని పేర్కొన్నారు. ఒకవైపు విద్యాశాఖ మంత్రి రాబోవు విద్యా సంవత్సరానికి ఉపాధ్యాయులను కూడా నియామకాలు చేపడుతామని చెప్పారని, నోటిఫికేషన్ ఇవ్వకుండా నియామకాలు ఏ విధంగా చేపడతారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులుకు ఇచ్చిన హామీ అమలు కోసం చర్యలు చేపట్టాలని తక్షణమే లేకుంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చ రించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సురేంద్రరెడ్డి పాల్గొన్నారు. **బద్వేలు :** రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికలలో నిరుద్యోగ అభ్యర్థులకు తాను అధికారంలోకి రాగానే డిఎస్‌సిపై మొదటి సంతకం చేస్తామని నోటిఫికేషన్‌ను వదిలి నియామక ప్రక్రియ చేపడుతామని హామీ ఇచ్చి నేటికీ 8 నెలలు అవుతున్నా ఇంతవరకు పట్టించుకోలేదని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడి యం చిన్ని తెలిపారు మంగళవారం బద్వేల్ పట్టణంలోని స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, ఎస్.కె.ఆదిల్, బద్వేల్ రూరల్ అధ్యక్ష కార్యదర్శులు ఉప్పులూరు బాల గురవయ్య ,ముడుమాల ఓబుల్ రెడ్డి లతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం

ప్రజాశక్తి - కడప

సమావేశంలో మాట్లాడుతున్న అంజాద్‌బాషా

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రాజ్యా ంగ వ్యతిరేకమని మాజీ ఉప ముఖ్య మంత్రి అం జాద్ బాషా అన్నారు. మంగళవారం తన నివా సంలోని కార్యా లయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టికల్ 13,14,15, 21, 25,26, 29,30 300-Aఉల్లంఘనకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని కాలరా సారన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా వైసిపి తరపున సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు వేసినట్లు తెలిపారు. ఈనెల 16న ఇందుకు సంబంధించి హియరింగ్‌కు వస్తుందని తెలిపారు. మొదటి నుంచి ఈ బిల్లుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ వ్యతిరేకమని స్పష్టం చేసిందని చెప్పారు. పార్లమెంట్‌లో బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని వైసిపి ఎంపీలకు విప్ కూడా జారీ చేశారని పేర్కొన్నారు. తిరిగి వైసిపిపై టిడిపి దుష్ప్రచారం చేయడం విడ్డూరం అని చెప్పారు. ఇప్ప టికైనా టిడిపి వైఎస్ఆర్ కాంగ్రెస్ పై దుష్ప్రచారం మానుకో వాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ షఫీ, వైసిపి మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

సభలు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - చెన్నూరు : మండలంలో ఎటువంటి ర్యాలీ, సభలు, సమావేశాలైన తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని సిఐ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ శుభ కార్యక్రమంలో డిజెలు నిర్వహించాలన్నా అనుమతులు తప్పనిసరి పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తప్పనిసరిగా మండల ప్రజలు అనుమతులు తీసుకొని పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

గాలివానకు నేలకొరిగిన అరటి

పడిపోయిన అరటి చెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి వీచిన గాలులు, వాన బీభత్సానికి అరటి తోటలు నేలకొరిగాయి. జంగంరెడ్డిపల్లె గ్రామంలో జయ రామిరెడ్డి, భారతి, మరి కొంతమంది రైతుల అరటి చెట్లు పడిపో యాయి. పడిపోయిన అరటి చెట్లను ముద్దనూరు ఉద్యానశాఖాధికారి మల్లేశ్వర్‌రెడ్డి, రైతు సేవ కేంద్రం అసిస్టెంట్ దీపికా పరిశీలించారు. మండల వ్యాప్తంగా దాదాపు 29 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తెలిపారు. ఆ మేరకు ఉన్నతాధికారులకు పంట నష్ట వివరాలను పంపనున్నట్లు వారు పేర్కొన్నారు.

అరటి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

ప్రజాశక్తి - లింగాల

ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్న అరటి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవల్ కెనాల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి వీచిన గాలులకు అరటి పంట దెబ్బతిన్న పెద్దకుడాల, గుణకణపల్లె గ్రామాల్లో మంగళవారం ఆయన పర్య టించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లా డుతూ పలు విషయాలు తెలుసుకున్నారు. మండల పరిధిలో ఏ స్థాయిలో అరటి పంట దెబ్బతిందో గుర్తించి నివేదికను తయారు చేయాలని ఉద్యాన శాఖ అధికారులకు సూచించారు. ఆ నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చూస్తానని ఆయన భరోసా ఇచ్చారు. మండల పరిధిలో 600 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పట్ల, లింగాల, రామన్నూతనపల్లె గ్రామాల్లో దెబ్బతిన్న తోటలను అధి కారులు ప్రాథమిక నివేదిక వేశారు. కార్యక్రమంలో టిడిపి మండలశాఖ అధ్య క్షుడు విశ్వనాథరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

పెద్దకుడాలలో అరటి పంటను పరిశీలిస్తున్న జోగిరెడ్డి


రేఖా చిత్రాలు పరిశీలిస్తున్న ఎంపిడిఒ ముకుందరెడ్డి

చింతకుంటలో ఎంపిడిఒ పర్యటన

ప్రజాశక్తి - ముద్దనూరు

పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందించే మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లోపించకూడదని ఎంపిడిఒ ముకుందరెడ్డి సూచించారు. చింతకుంట అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, పారిశుధ్యం, ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్నం భోజనం తనిఖీ చేశారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు తాగునీరు సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు దినసరి వేతనం పెండింగ్ లేకుండా వారి ఖాతాలో నగదు జమ చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సచివాలయం, ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం గ్రామ సమీపంలోని కొండ రాళ్లపై ఆది మానవుడు గీసిన రేఖా చిత్రాలను పరిశీలించారు. కొన్ని వేల సంవత్సరాల క్రితం ఆది మానవుడు కొండ రాళ్లపై గీసిన రేఖా చిత్రాలు అద్భుతమైన కళా ఖండాలని ఆయన కొనియాడారు. సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఎపిఒ గంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగులోకి వీరగల్లు విగ్రహం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లి గ్రామంలో 16 శతాబ్దం కాలంనాటి వీరగల్లు వెలుగులోకి తెచ్చినట్లు రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరగల్లు విగ్రహంలో వీరుడు కుడి చేతిలో కత్తి, ఎడమ చేతిలో సంగీత వాయిద్య పరికరాన్ని పట్టుకున్నట్లు ఉందన్నారు. విగ్రహం పైభాగంలో కొన్ని జంతువులు చిత్రీకరించబడ్డాయన్నారు. వీరుని కింది భాగంలో ఒక రేసు కుక్క చెక్కబడి ఉందన్నారు. గ్రామంపై ఏదేని దాడి జరిగినప్పుడు ఆ దాడిని ప్రతిఘటించి వీరమరణానికి గుర్తుగా ఈ వీరగల్లు విగ్రహాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ వీరుడు శైవ భక్తుడు వీరమరణం పొందక ముందు తన ఎడమ చేతిలో ఉన్న సంగీత వాయిద్య పరికరాన్ని ఆడిస్తూ, శివుని గురించి ప్రార్థిస్తూ తన్మయత్వం చెంది నాట్యం చేస్తున్నట్లుగా వీరగల్లు ఆనాటి కాలంలో చెక్కబడిందని రమేష్ వివరించారు. వీరగల్లు విగ్రహం గురించి శెట్టివారిపల్లె గ్రామస్తులు కొప్పర్తి కిరణ్‌కుమార్ రెడ్డి, పార్థసారధిరెడ్డి తనకు సమాచారం అందించారన్నారు. గతంలో వర్షాభావ పరిస్థితుల్లో భూమిలో ఉన్న ఈ వీరగల్లు విగ్రహాన్ని కొప్పర్తి బాలసుబ్బారెడ్డి అనే వ్యక్తి బయటకు తీసి పూజలు చేయడంతో వర్షాలు పడేవన్నారు. ఆ తర్వాత మళ్లీ దీన్ని భూమిలో పాతిపెట్టే వారని తెలిపారు. రహదారి మరమ్మతులు, రహదారి విస్తరణ పనులు పలుమార్లు జరుగుతుండడంతో బాల సుబ్బారెడ్డి ఈ విగ్రహాన్ని మళ్లీ బయటికి తీసి పెట్టారని రమేష్ వెల్లడించారు. విగ్రహం గురించి ప్రముఖ స్తపతి, వాస్తు శిల్ప కళావచస్పతి ఈమని శివనాగిరెడ్డికి తెలపగా ఆయన ఇది 16వ శతాబ్దం కాలం నాటిదని స్పష్టం చేశారని రచయిత తెలిపారు.

అన్నదానం చేస్తున్న మాలమహానాడు నాయకులు

అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా చిలమకూరులో ఉన్న రాజరాజేశ్వరి అనాథ వృద్ధాశ్రమంలో నాలుగు రోజులు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వారధి యాకోబు తెలిపారు. మంగళవారం చిలమకూరులో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించేందుకు అంబేద్కర్ 60 దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేశారని తెలిపారు. అందరికీ ఆమోదయోగ్యంగా, సమన్యాయంగా రాజ్యాంగం రూపకల్పన చేశారని వివరించారు. ప్రస్తుతం ఉన్న పాకుల తీరు రాజ్యాంగాన్ని అగౌరవపరిచేలా ఉందన్నారు. మత రాజకీయాలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు వినోద్‌కుమార్, గౌరవ అధ్యక్షులు లాజారాస్, నాయకులు పుల్లేటి రవి, పుల్లేటి ప్రభాకర్, ఆనందరావు, ప్రేమ్‌కుమార్, సి.ప్రభాకర్, జగన్, రత్నపాల్ పాల్గొన్నారు.

రేపు ముద్దనూరు మండల సమావేశం

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక మండల ప్రజా పరిష్యత్ కార్యాలయ సభా భవనంలో గురువారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ముకుందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, ఉపాధి, ఇళ్లు, విద్యుత్, వ్యవసాయం, రోడ్లు వంటి మొదలైన అంశాలపైన చర్చించనున్నట్లు తెలిపారు. సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా శాఖల మండల అధికారులు, కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ ఎస్ఐ విష్ణు నారాయణ హెచ్చరించారు. పట్టణ పరిధిలోని నగిరిగుట్టలో మంగళవారం పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ ఆదేశాల మేరకు నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానం ఉన్న ఇళ్లను తనిఖీ చేశారు. ఎస్ఐ ప్రజలతో మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని సమాచారం వస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణానికి సహకరించాలని కోరారు.

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నీరు వృథా.. పట్టని అధికారులు

ప్రజాశక్తి - ముద్దనూరు

వర్షపునీరు సైతం వృథా కాకుండా ఆదా చేయాలని ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవా లని అధికారులు సూచిస్తున్నారు. తాగునీరు వృథా కాకుండా చూడాలని అధి కారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో బోరు పైప్‌ల నుంచి నీరు వృథా అవుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వేసవిలో తాగు నీటి సమస్య రాకుండా ప్రతి గ్రామానికి నీరు అందించాలని ప్రభుత్వం అధి కారులకు ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే.. కొలవలి గ్రామంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు బోరు ఏర్పాటు చేశారు. ఈ బోరుకు అమర్చిన పైపులు లీకు కావడంతో బోరు వద్ద నీరు వృథాగా పోతోంది. బోరు నుంచి పైపులైన్ ద్వారా గ్రామంలోని ప్రజలకు నీరు సరఫరా చేయాల్సి ఉంది. కొత్త పైపులు ఏర్పాటు చేసి వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని గ్రామ సర్పంచ్, కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కొత్త పైపులు ఏర్పాటు చేయాలి

బోరు వద్ద అమర్చిన పైపులు పాడై నీరు లీకవుతోంది. సర్పంచ్, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఉన్నతా ధికారులు స్పందించి కొత్త పైపులు ఏర్పాటు చేయాలి. ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలి.

- ప్రవీణ్ గ్రామస్తుడు

కొలవలి గ్రామంలో వృథాగా పోతున్న నీరు

ప్రయివేట్ ఏజెన్సీ వద్దు.. ఆప్కాస్ ముద్దు

నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు, మునిసిపల్ వర్కర్స్ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులను అందరిని పర్మినెంట్ చేయాలి.. లేకుంటే ఆప్కాస్ కార్మికులతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జి.ఏసుదాస్, దాసరివిజయ్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శి శేఖర్, నాగన్న సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులతో గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేస్తే ప్రజారోగ్యాన్ని పర్యావరణాన్ని పరిరక్షిస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రస్తుతం అప్కాస్‌ను రద్దుచేసి ప్రయివేట్ ఏజెన్సీలకు ఇవ్వాలనే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షుడు ఏ వినయ్‌కుమార్, నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, శివ, చంటి, పుల్లయ్య, నటరాజు, సుధీర్, రవి, పుల్లయ్య, సుబ్బారాయుడు, ఎస్సయ్య, రాజేష్, పుల్లమ్మ, ప్రభావతి, వెంకటలక్ష్మీ, జయలక్ష్మి, లక్ష్మి, తిరుపతమ్మ , సుశీల, కార్మికులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం)అధ్యక్షులు సత్యనారాయణ కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మూడు రోజులపాటు కార్మికులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారి స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలన్నారు. అనంతరం పారిశుధ్య అధికారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి సాల్మన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, పట్టణ కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్ కమిటీ సభ్యులు గురమ్మ రమాదేవి, నీతమ్మ, మోహన్, సురేష్, నరసమ్మ మరియమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : వినతిపత్రమిస్తున్న కార్మికులు

పారిశుధ్య కార్మికులకు న్యాయం చేయాలి

సూపరింటెండెంట్‌కు వినతి పత్రమిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రభుత్వాసుపత్రిలో పారిశుధ్య కార్మికులకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, ఆసుపత్రి యూనియన్ గౌరవ అధ్యక్షులు రాఘవ డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెం ట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ పారిశుధ్య కార్మికులు 65 మంది ఉన్నారని, రెండు నెలల నుంచి వేత నాలు అందడం లేదన్నారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సకాలంలో చెల్లిం చడం లేదన్నారు. వారికి మెసేజ్ రావడం లేదన్నారు. నెలల తరబడి జీతాలు చెల్లించడం లేదన్నారు. జిఒ ప్రకారం రూ.16 వేలు వేతనం ఇవ్వాలని, రూ.12,400 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. కార్మికు లకు రూ.18,500 వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు న్యాయం అందని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో హాస్పిటల్ యూనియన్ అధ్యక్షులు రత్తమ్మ, ప్రధాన కార్యదర్శి కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు, సహాయ కార్యదర్శి గంగాధర్, కమిటీ సభ్యులు రాణి, నరసింహులు, దేవి కొంగలి, మరియమ్మ, లక్ష్మీ, చెల్లమ్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

21న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

భూ పంపిణీ చట్టం అమలు చేసి అర్హులైన పేదలకు అమలు చేయాలని కోరుతూ ఈనెల 21న కలెక్టరేట్ వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. అన్వేష్ పిలుపునిచ్చారు. మండలంలోని చిలమకూరు ఎస్టీ కాలనీలో మంగళవారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు మంజూరు చేయాలన్నారు. ఎర్రగుంట్ల, ముద్దనూరు, కాశినాయన, కలసపాడు, బి.కోడూరు, అట్లూరు, బి.మఠం, ఒంటిమిట్ట మండలాలలో ప్రభుత్వ భూములను రాజకీయ పలుకుబడి గల స్థానికులు స్వాధీనం చేసుకున్నారని అన్నారు. వాటిని వెనక్కి తీసుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, నూరు రోజులు పని పూర్తి చేసుకున్న వారికి పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు తిరుమలయ్య, వెంకటేశు, నాగరాజు, శంకర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

దోమ కాటుకు గురికావొద్దు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ శాంతకుమార్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ లో విద్యార్థులకు దోమకాటు వల్ల వచ్చు వ్యాధుల గురించి ఆయన అవగాహన కల్పించారు. దోమ కాటుతో మలేరియా, డెంగీ, మెదడువాపు, చికెన్ గన్యా, బొదకాలు తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయని వివరించారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటిం చాలని సూచించారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో శుభ్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, ఆశా కార్యకర్తలు శిరీష, జ్యోతి, ప్రిన్సిపల్ రవికాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

అందుబాటులో ఉన్న న్యాయ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మైనుద్దీన్ సూచించారు. చాపాడు మండల న్యాయ సేవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం పుల్లారెడ్డి నగర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి, తద్వారా అన్యాయం జరిగినప్పుడు న్యాయం పొందాలన్నారు. పుట్టబోయే బిడ్డ నుంచి మృతి చెందే వరకు ప్రతి ఒక్కరికి చట్టాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. న్యాయవాదులు అందుబాటులో ఉన్న చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ నాగేంద్ర ప్రసాద్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శివరామ్, బార్ అసోసియేషన్ న్యాయవాదులు శ్రీనువాసులు, కరిముల్లా, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కళా దినోత్సవం

ప్రజాశక్తి - వేంపల్లె

వేసిన బొమ్మలతో విద్యార్థులు

వేంపల్లెలో ఘనంగా ప్రపంచ కళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయిం గ్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఈ పోటీల్లో పెద్ద ఎత్తున పాల్గొ న్నారు. పర్యావరణ, ఇండియా, నీటి అవసరాలకు చెందిన ప్రాజెక్టుల తోపాటు ఆయా రంగాలకు చెందిన బొమ్మలను విద్యార్థులు వేశారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నాణ్యమైన పత్తి విత్తనాలు అమ్మాలి

పులివెందుల రూరల్ : రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు అమ్మాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయ గుంటూరు అధికారులు సూచించారు. మంగళవారం పట్టణ పరిధిలో దుకానాలను పరిశీలించారు. విత్తన దుకాణాల లైసెన్సులను, వివిధరకాల, కంపెనీల పత్తి విత్తనాలను హెటి కాటన్ స్ట్రిప్స్ ద్వారా వాటి నాణ్యతను పరీక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆయిల్ సీడ్స్ బుక్కే భాస్కర్, అగ్రికల్చర్ ఆఫీసర్ శివశంకర్, జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ గోవర్ధన్, మండల వ్యవసాయ అధికారి జి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DIST JUDGE, KADAPA
M.V.O.P. No. 527/2024

Jakka. Raju & Another. ...Petitioners

Vs

K.Kishore Kumar,S/o Ananda Rao, aged about 45 years, Hindu, Bus Driver, R/o D.No.2/467, Kesanna Satram, Proddatur Town, Kadapa District. ...Respondent No.3

NOTICE

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పై వాది యొక్క కొడుకు ప్రతివాది బస్సు ఆక్సిడెంటులో చనిపోయినందులకు గాను వాది, పై ప్రతివాది పైన దాఖలు చేసిన పిటిషను వాయిదా 13.05.2025వ తేదీన వున్నది. కావున పై ప్రతివాది 13.05.2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు వకీలు ద్వారా గాని, లేక ఖుద్దున గాని పై కోర్టు నందు హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.

యం.రామాంజనేయ రెడ్డి, M.A., B.L.,
అడ్వకేట్
కడప.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PRODDATUR
E.P.No. 74/2023 in O.S.No. 81/2016

Mitta Narasimhulu, aged about 54 years, son of M.Seetha Ramaiah, Hindu, Business, residing at D.No.18/569, Main Bazaar, Proddatur Town, Kadapa District. ...Petitioner/D.Hr.

Vs

Singam. Gangadhara Reddy, aged about 45 years, son of S.Gangi Reddy, Hindu, Business, residing at D.No.3/532, YMR Colony, Proddatur Town, Kadapa District. ...Respondent/J.Dr

U/O 21 R22 ప్రకారం RESPONDENT/ J.DR.కు నోటీసు

ఈ నెంబరు E.P.లోని రెస్పాండెంట్/ జె.డి.ఆర్.పైన, పిటిషనరు/ డిహెచ్ఆర్ E.P.షెడ్యూలు ఆస్తిని వెలమునకు కోరి E.P.దాఖలు చేసి ఉన్నారు. అట్టి E.P.లో రెస్పాండెంట్/జెడిఆర్ అయిన నీకు 30.6.2025 నాడు వాయిదా ఉంటూ ఉన్నది. అట్టి తేదీ నాడు ఉదయం గం॥10.30 ని॥లకు కోర్టువారి ఎదుట హాజరై ఏవైనా ఆక్షేపనలు ఉన్న ఎడల తెల్పుకోవసినది.లేనంతట నీ పరోక్షమందు తీర్మానించబడును.

వాయిదా తేది: 30.6.2025

//By Order of the Court//

పి.చంద్రశేఖర్
పిటిషనరు/డిహెచ్ఆర్ పరం అడ్వకేట్
ప్రొద్దుటూరు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE: KADAPA
I.A.No. 2588 of 2024 in C.M.A. No. of 2024

Between :
1. Komma Somalinga Reddy, Son of K. Siva Reddy, aged about 61 years, Hindu, Business,
2. Komma Soma Siva Sankar Reddy, Son of K. Siva Reddy, aged about 59 years, Hindu, Business,
Both 1 and 2 are resident of Diguva Lingala (V), Lingala Mandal, YSR Kadapa District, Andhra Pradesh.

...Petitioners/Appellants

And

5. Shaik Ghousia, Daughter of Late Shaik Dada Kalandar, aged about 35 years, Muslim, Home maker, resident of D.No.6/1751, Ravindra Nagar, Kadapa City and District, Andhra Pradesh.

...Respondents/Respondents No.5

NOTICE TO THE RESPONDENT NO.5

Please take notice that the petitioner / plaintiff has filed the above I.A. to condone the delay of 342 days in filing the appeal, stands posted to 07.05.2025 at 10.30 AM, either personally or through advocate, before the said court. If you fail to appear, on the above date, matter will be decided exparte.

//By Order of the Court//

M.SURESH KUMAR, M.A., B.L.,
Advocate for the Petitioners-Plaintiffs,
Kadapa City, A.P.
Cell: 8500271919

తహశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న రైతులు

ఇబ్బంది లేకుండా రైల్వేలైన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు సమీపంలోని నిడ్జి గ్రామ పొలాల్లో నూతనంగా ఏర్పాటు చేయబోవు రైల్వేలైన్ రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని తహశీల్దార్ శోభన్‌బాబును రైతులు కోరారు. ఆ మేరకు 18మంది రైతుల సంతకాలతో మంగళవారం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తమ పొలాల్లో రైల్వే అధికారులు రాళ్లు పాతారని తెలిపారు. ప్రస్తుతం నంద్యాల రైల్వేలైన్ పొలాల మధ్యలో పోయిందని, అప్పుడు రైతులు నష్టపోయారని వివరించారు. తద్వారా ఇప్పటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటూనే ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దానికి అనుసంధానంగా బైపాస్ క్రొత్త రైల్వేలైన్ కూడా పొలాల మధ్యలో పోతే ఉన్న పొలం నీరు అందక బీడు పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఒక ప్రణాళిక ప్రకారం రైతులు నష్టపోకుండా రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, శ్రీధర్, మధు, గోపాల్ పాల్గొన్నారు.

సకాలంలో పన్ను చెల్లించి.. రాయితీ పొందండి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మాట్లాడుతున్న కమిషనర్ రాముడు

పురపాలక ప్రజలు సకాలంలో పనులు చెల్లిస్తే రాయితీ పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. పులివెందుల పురపాలక సంఘం కార్యాలయ సభ భవనంలో మంగళవారం అన్ని సచివాలయాల అడ్మిన్, అమెనిటి, వెల్ఫేర్ సెక్రటరీలతో ఆస్తి పన్ను, నీటి పన్ను వసూళ్ల గురించి సచివాలయం వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-2026కు సంబంధించి ఆస్తి పన్ను పూర్తి మొత్తం చెల్లించిన వారికి ప్రభుత్వం కల్పించిన 5 శాతం పన్ను రాయితీ, పాత బకాయిలు ఏక కాలంలో చెల్లించిన వారికి వడ్డీ మొత్తంలో 50 శాతం తగ్గింపు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా వారిచే ఆస్తి పన్ను కట్టించాలన్నారు. అనధికార కుళాయిలను క్రమబద్ధీకరిస్తూ నీటి పన్ను వసూళ్లపై ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. ఆస్తి పన్ను, నీటి పన్ను నిర్దేశించిన సమయంలో కచ్చితంగా వసూలు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్షం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి మునికుమార్, సచివాలయం నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా దుంపలగట్టు అంకాలమ్మ తిరుణాల

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని దుంపలుగట్టు గ్రామంలో శ్రీశ్రీశ్రీమహాకాళి అంకాలమ్మ అమ్మవారి తిరుణాల మూడు రోజులపాటు నిర్వహించారు. మంగళ వారంతో ముగిసింది. ఈ సందర్భంగా దుంపలుగట్టు పరిసర ప్రాంత గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. దుంపలగట్టులోని అంకాలమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అంకాలమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆయా గ్రామాలలో బంధుమిత్రులతో గ్రామంలో సందడి నెలకొంది. వైసిపి నాయకులు రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే సుధ, జడ్‌పి చైర్మన్ రామగోవింద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, స్థానిక వైసిపి నాయకులు పివి రాఘవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వీరనారాయణరెడ్డి, శ్రీమన్నారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి వైసిపి నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి సోదరులు విందు ఏర్పాటు చేశారు.

ట్రాక్టర్, వరి గడ్డి దగ్ధం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పులివెందుల రోడ్డులో వరి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. మంగళవారం పశువుల కోసం ట్రాక్టర్‌లో వరిగడ్డి వేసుకొని వస్తుండగా.. స్థానిక జిటి ఫంక్షన్ హల్ సమీపంలోని గేదెల షెడ్ వద్ద విద్యుత్ వైర్లు తగిలి గడ్డికి అగ్ని మంటలు వ్యాపించాయి. గడ్డితోపాటు ట్రాక్టర్ పూర్తిగా కాలి పోయింది. ప్రమాద విషయం తెలిసిన వెంటనే అగ్ని మాపకం సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. అగ్ని ప్రమాదం జరగడంతో రూ.లక్షలాది నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

NOTICE
మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఒంగోలు
OS No : 743/2023

Between
ఉబ్బా వెంకాయమ్మ ....వాది
వర్సెస్
జడ్డా చిన్నక్క ....ప్రతివాది

To
జడ్డా చిన్నక్క, D/o ముక్తినూతలపాటి సీతారామయ్య R/o నల్లగుత్త పల్లె, రామాపురం మండలం,వై.ఎస్.ఆర్ కడప జిల్లా,

పై నెంబరు దావాలో కోర్టు వారి ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసు పంపిననూ ముట్టనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈపేపర్ ద్వారా నోటీసు ఇవ్వడమైనది. పైనెంబర్ దావాలో మీహాజరు నిమిత్తం తేది:16-05-2025కువాయిదా అయినది. వాయిదా రోజు ఉదయం 10:30కు మీరు స్వయం గా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణ లు తెలుపుకొనగలరు అలా హాజరు కాని పక్షంలో మీ పరోక్షమున తీర్మానించబడును

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది : 16-05-2025

ఇట్లు
నరశింగోలు శ్రీనివాస్ ప్రసాద్
చాకలికొండ శివకుమార్
బత్తిన లక్ష్మీనారాయణ
అడ్వకేట్స్,
నియర్ పివిఆర్ బాలికల పాఠశాల,
కోర్ట్ సెంటర్ ఒంగోలు